

ఉత్తమ రైతుగా జిన్ను



ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ నుంచి ఉత్తమ రైతుగా అరమ పంచాయతీ బడిమెల గ్రామానికి చెందిన తాంగుల జిన్ను ఎంపికయ్యారు. ఉత్తమ రైతుగా ఎంపికయిన ఆయనకు ప్రశంస పత్రం, జ్ఞాపికతోపాటు రూ 25వేలు నగదు ప్రోత్సహం అందుకోనున్నారు. ఆయన 2017లో వన వికాస మ్యాక్స్ బోర్డు సహకారంతో మాతోట ద్వారా గులి రాగి విధానంలో ఎకర భూమిలో 21.6క్వింటాళ్ల గులి రాగిని పండించారు. వికాస సంస్థ సహకారంతో గులి రాగితోపాటు వాణిజ్య పంటలను సేంద్రియ పద్ధతిలో పండిస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు. ఈనెల 12న గుంటూరు జిల్లా క్రిష్ణ ఆడిటోరియంలో ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొని అవార్డును తీసుకోనున్నారని వికాస సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ తెలిపారు.



ఎగిసి పడుతున్న దుమ్ము

జాతీయ రహదారిపై చెలరేగుతున్న దుమ్ము,ధూళి

-అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండలం జాతీయ రహదారి పనుల్లో భాగంగా కొత్తబల్లుగూడ గ్రామ సమీపంలో దుమ్ము ధూళితో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తబల్లుగూడ గ్రామానికి దగ్గర కావడంతో పెద్ద పెద్ద వాహనాలు అతివేగంతో వస్తుండడంతో ఇంటిలో దుమ్ము ధూళి కమ్మేస్తుందని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. క్రషర్ బుగ్గి పోసి కనీసం వాటరింగ్ చేయక పోవడంతో దుమ్ము ధూళి బూడిద దట్టంగా ఎగిసి ప్రయాణికుల కళ్లల్లో పడుతుంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే నెలలు తరబడి రోడ్డుపై తారు వేయకుండా క్రషర్ బుగ్గి పోసి గుత్తేదారుడు నిర్లక్ష్యం వహిస్తున్నాడని జనం మండిపడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి జాతీయ రహదారి పనుల్లో దుమ్ము ధూళి నుండి ఉపశమనం కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

శిథిలావస్థలో కాశీపట్నం వంతెన

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని కాశీపట్నం సచివాలయం ఆనుకుని ఉన్న పల్లంవలస మార్గమధ్యలో గోస్తని గెడ్డపై నిర్మించిన బ్రిడ్జి శిధిలవస్థకు చేరింది. గతంలో సుమారు 500 మీటర్లు పొడవు కలిగిన బ్రిజ్జిని అప్పటి ప్రభుత్వం నిర్మించింది. ఎన్ ఆర్ పురం, రొంపల్లి, కాశీపట్నం పంచాయితీ గ్రామాల కు చెందిన గిరిజన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికే బ్రిడ్జి సైడ్ వాల్స్ ఇప్పటికే పూర్తిగా దెబ్బ తిన్నాయి. లోడుతో ఉన్న వాహనాలు వెళ్తున్న క్రమంలో బ్రిడ్జి కదులుతోంది. దీంతో ఎప్పుడూ ఏం జరుగుతుందోనన్న భయాందోళన నెలకొంది. ప్రతి బుధవారం కాశీపట్నంలో జరిగే వారపు సంతకు తీసుకువచ్చిన అటవీ ఉత్పత్తులను వ్యాపారస్తులు కొనుగోలు చేసి రవాణా చేస్తుంటారు. అధికారులు స్పందించి బ్రిడ్జి మరమ్మతు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న వంతెన



రాజవొమ్మంగిలో నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నేతలు

వెబ్ కౌన్సెలింగ్ బహిష్కరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఉపాధ్యాయ వెబ్ కౌన్సెలింగ్‌ను వ్యతిరేకిస్తూ శనివారం యూటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బాయ్‌కట్ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల కార్యదర్శి శ్రీను, జిల్లా నేతలు పైడిమల్లు, రమేష్ తదితరులు మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదికకు ఇచ్చిన హామీకి భిన్నంగా సెకండరీ గ్రేడ్, లాంగ్వేజ్ పండిట్స్, పిఈటిల బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు విద్యాశాఖ పూనుకుందని ఇప్పటికే వెబ్‌ఆప్షన్స్ బాయ్‌కట్ చేయాలని పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు వెబ్ కౌన్సెలింగ్‌ని బాయ్‌కట్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల యుటిఎఫ్ వెంకటలక్ష్మి, రాంబాబు, రాజబాబు, లక్ష్మణరావు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

గంగవరం : ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదికకు ఎస్‌జిటిలకు మాన్యూవల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఇచ్చిన హామీకి భిన్నంగా బదిలీ కౌన్సెలింగ్‌లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి పూనుకున్నారన్నారు. దీనిని వ్యతిరేకిస్తున్నట్టు ఎపియుటిఎఫ్ గంగవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. శనివారం ఎంఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అధికారులు తీరు మారకుంటే ఆదివారం ఉదయం 10 గంటలకు పెద్ద సంఖ్యలో డిఇఒ కార్యాలయం ముట్టడికి ఉపాధ్యాయ శ్రేణులు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో, పి. కుసుమకుమారి, జానకమ్మ, నాగేశ్వరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జూలై 9న సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -హుకుంపేట: దేశ వ్యాప్తంగా జూలై 9 న జరిగే సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలనీ సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సీఐటీయూ మండల నాయకులు, హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, దేశంలో పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం బీజేపీ మోడీ ప్రభుత్వం, చంద్రబాబు కూటమి ప్రభుత్వం, ఉద్యోగులు, కార్మికుల కు వ్యతిరేకంగా లేబర్ కోడ్స్ తెచ్చారన్నారు.కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, విశాఖ స్టీల్ ప్లాంట్, పోర్టు, ఎల్ఐసీ వంటి ప్రభుత్వ రంగ కంపెనీలను ప్రైవేటు పరం చేయొద్దని డిమాండ్ చేశారు.కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి,పర్మినెంట్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకురాలు హైమావతి మాట్లాడుతూ, జూలై 9న జరుగనున్న ఈ సమ్మెలో అంగన్ వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్, హాస్టల్, పంచాయితీ వర్కర్స్, లైజన్ వర్కర్స్, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ లు, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వంతాల స్వప్న, సావిత్రి, సొమ్రన్న, మొత్తి, స్వాతి కొండలరావు, వరలక్ష్మి, శ్రీకాంత్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సిఐటియు నాయకులు, కార్యకర్తలు

వర్షానికి నేల కొరిగిన విద్యుత్ స్తంభం


ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లిలో శనివారం మధ్యాహ్నం కురిసిన గాలివాన కలకలం రేపింది. సాయిబాబా ఆలయం సమీపంలోని జాతీయ రహదారి వద్ద బలమైన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం నేల కొరిగింది. ఈ ఘటనతో మండల కేంద్రంలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా స్తంభించింది. స్తంభం రోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్‌కు తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. అధికారులు విద్యుత్ పునరుద్ధరణ పనులను చేపట్టారు.



నేల కూలిన విద్యుత్ స్తంభం

మేకను మింగిన కొండచిలువ

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండలంలో అత్యంత మారుమూల ప్రాంతమైన రంగబయలు పంచాయతీ పరిధికి చెందిన వలజాంగి గ్రామంలోని అడవిలో మేతకు వెళ్లిన మేకను కొండచిలువ వేటాడి మింగేసింది. స్థానిక గిరిజనులు తెలిపిన వివరాలు..ఎండాకాలం కావడంతో ఆవులు, మేకలను మేతకు కాపరి విడిచి పెట్టాడు. గ్రామ పరిసరాల ప్రాంతంలో దట్టమైన అడవులు కలిగి ఉండడంతో మేతకు వెళ్లిన మేకను కొండచిలువ మింగేసింది.శుక్రవారం రాత్రి మేక రాకపోవడంతో శనివారం మేకను మింగిన కొండచిలువ ప్రత్యక్షమైంది. .




మేకను పట్టుకున్న కొండచిలువ



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుసారా

180 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - రంపచోడవరం : అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగ రాహుల్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రజిత్, వారి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దేవీపట్నం మండలం పాముగండి గ్రామంలో ఆకస్మిక దాడులు నిర్వహించి 180 లీటర్ల నాటు సారాయిని స్వాధీన పరుచుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.




ఉదయం వేళలో కురుస్తున్న మంచు

చింతపల్లిలో విభిన్న వాతావరణం

- ఒకే రోజులో మంచు, ఎండ, వాన

ప్రజాశక్తి-చింతపల్లి: అల్లూరి జిల్లాలోని చింతపల్లిలో విభిన్న వాతావరణం శనివారం నెలకొంది. ఒక్క రోజులోనే మూడు కాలాలను వాతావరణం తలపించడంతో ప్రజలను ఆశ్చర్యానికి గురి చేసింది. ఉదయం నుంచి సాయంకాలం వరకు మూడుసార్లు వాతావరణం తమ తీరును మార్చింది. ఉదయం సమయంలో చింతపల్లిలో మబ్బులతో కలసిన పొగ మంచు దట్టంగా కమ్ముకోవడంతో చలికాలంలా అనిపించింది. మధ్యాహ్నానికి సూర్యుడు భగభగా మండిపోవడంతో ఉష్ణోగ్రతలు 40-42 డిగ్రీలు నమోదు అయ్యింది. ఈ కారణంగా ప్రజలు నీడకే పరిమితమయ్యారు. సాయంకాలానికి మరోమారు వాతావరణం మారిపోయింది. ఆకాశంలో మేఘాలు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది.



మధ్యాహ్నం వేళలో సూర్యుడు



సాయంత్రం వేళలో కురుస్తున్న వర్షం

డ్రోన్ల వినియోగంపై అవగాహన

నక్కపల్లి: వాణిజ్య పంటల సాగులో డ్రోన్ వినియోగాన్ని పెంచడం ద్వారా చీడపీడలను సకాలంలో తక్కువ ఖర్చుతో అదుపులో ఉంచవచ్చని వాణిజ్య పంటల పరిశోధన సంస్థ (రాజమండ్రి) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. ప్రభాకర్ రావు రైతులకు సూచించారు. వికసిత కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలో శనివారం దోసలపాడు, రేబాక, డి.ఎల్. పురం గ్రామాల్లో బిసిటి-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో, వ్యవసాయ శాఖ సహకారంతో శాస్త్రవేత్తలు, అధికారులు రైతులతో సమావేశం నిర్వహించి వాణిజ్య పంటల సాగు పై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు సరైన మోతాదులో వాడుతూ జీవ నియంత్రణ పద్ధతులను అవలంబించాలని సూచించారు. చిరుధాన్యాలను కనీసం ఇంటికి సరిపడా సాగు చేసుకుని, భోజనంలో ఒక పూట తప్పనిసరి చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ, మామిడి, బొప్పాయి, కూరగాయల పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు.

ఎఒబిలో పోలీసుల అలర్ట్

- ముమ్మరంగా వాహన తనిఖీలు
- ఏజెన్సీకి వెళ్లే నైట్ బస్సు సర్వీసులు రద్దు

ప్రజాశక్తి -సీలేరు: ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దుల్లో పోలీసులు అలర్ట్ అయ్యారు. చత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో పోలీసులకు మావోయిస్టులకు జరిగిన ఎదుర్కొల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటి సభ్యుడు నంబాల కేశవరావు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతికి నిరసనగా ఈ నెల 10వ తేదీన మావోయిస్టులు భారత్‌బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు ఎటువంటి దుశ్చర్యలకైనా పూనుకుంటారని ఇంటలిజెన్సీ వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. ఈ నేపథ్యంలో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు పోలీసులు అప్రమత్తమై అదనపు బలగాలతో సరిహద్దు ప్రాంతం జల్లెడ పడుతున్నారు. సరిహద్దుల్లో వచ్చే పోయే వాహనాలని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మావోయిస్టులు ప్రతీకార దాడులకు దిగితే వాటిని తిప్పి కొట్టడానికి పోలీసులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు.

నైట్ సర్వీసులు రద్దు

మావోయిస్టులు ఈ నెల 10న భారత్‌బంద్‌కు పిలుపునివ్వడంతో నైట్ సర్వీస్ బస్సులు 9 నుంచి 11 వరకు రద్దు చేయాలని పోలీస్ అధికారులు ఆర్టీసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విశాఖపట్నం పాడేరు డిపోలుకు చెందిన వయా చింతపల్లి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్‌బస్ సర్వీసులతో పాటు విశాఖ వయా గూడెం మీదుగా సీలేరు వచ్చే నైట్‌హాల్ట్ బస్ సర్వీసును కూడా రద్దు చేసినట్లు ఆర్టీసి డిపో మేనేజర్ గంగరాజు పేర్కొన్నారు. తిరిగి ఈనెల 12 నుంచి నైట్ సర్వీస్‌లు తిరుగుతాయని తెలిపారు. జీకే వీధి మండలం సీలేరు ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

బాధితునికి నారా లోకేష్ సాయం

ప్రజాశక్తి -కూనవరం : మండలంలోని చూచిరేవుల గూడెం గ్రామానికి చెంది సోమకృష్ణ ప్రమాదానికి గురయ్యాడు.బాధితునికి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని వెల్‌నెస్ హాస్పిటల్‌లో చేర్పించగా వైద్యానికి లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు అరకు పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్‌కుమార్‌కి విషయాన్ని తెలియజేశారు. ఆయన మంత్రి నారా లోకేష్‌కి ట్వీట్ రూపంలో తెలియ జేయడంతో వెంటనే స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్ 2.50 లక్షలు మంజూరు చేసారు. బాధిత కుటుంబం మంత్రి నారాలోకేష్, రంజిత్ కుమార్‌కి కృతజ్ఞతలు తెలియజేసారు.



ఆసరడలో నేలకొరిగిన చెట్టు

గాలివానకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - జీకే వీధి: మండలంలోని రింతాడ పంచాయతీ ఆసరడలో శనివారం గాలివర్షం కురిసింది గాలివాన ధాటికి చెట్టు కూలిపడడంతో నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మత్తులు చేపట్టారు.

సీలేరు నదిలో వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి - మోతుగూడెం : చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో పర్యాటక స్థలం లో శనివారం ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. దేవరపల్లి నుండి వచ్చిన ఐదుగురు పర్యాటకులు స్నానం చెయ్యడానికి సీలేరు నదిలో దిగగా ఒకసారిగా నది నీటిమట్టం పెరగడంతో ఐదుగురు పర్యాటకులలో స్థానికులు నలుగురిని కాపాడగా ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. మోతుగూడెం పోలీసులు స్థానిక గజఈతగాళ్ల సాయంతో గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్నారు.



మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. రాజవొమ్మంగి రహమానియా మసీదులో మసీదు గురువు హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మానవాళి అంతా శాంతియుతంగా జీవించాలని ఆలీ దావూద్ తదితరులు తెలిపారు.

షైనింగ్ స్టార్ అవార్డుకు ఐదుగురు విద్యార్థులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: పదోతరగతి పరీక్షల్లో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులు షైనింగ్‌స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈఓ సత్యనారాయణదొర శనివారం తెలిపారు. కుడుముల సబిత (550), దాన్యశ్రీ (549), నక్కా రుషికేష్ (547), భువనేశ్వరి (543) నవీన్‌దుర్గ (420) అవార్డుకు ఎంపికయ్యారని తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

100 కిలోల గంజాయి పట్టివేత : ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - చింతూరు : మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు శనివారం నిర్వహించిన తనిఖీల్లో కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు 100 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు వాహనతనిఖీలు నిర్వహించారు. పట్టుబడిన ఇద్దరూ చింతూరు మండలానికి చెందిన తూలుగొండ గ్రామం కరణం రామాంజనేయులు, ఆరేళ్ల బుజ్జిని వారు ప్రయాణం చేస్తున్న కారుతో పాటుగా గంజాయిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చింతూరు ఎఎస్‌పి పంకజ్‌కుమార్‌మీనా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరు గంజాయి అక్రమ రవాణాకు ఒక గ్యాంగులా పనిచేస్తున్నారని తాతారావు డొంకరాయి చింతూరు పోలీస్‌స్టేషన్లలో రెండు ఎన్‌డిపిఎస్ కేసులో నిందితులుగా ఉన్నారని కరణం రామాంజనేయులు చింతూరు పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎన్‌డిపిఎస్ కేసులో నిందితులుగా ఉన్నారని వీరు తెలంగాణ రాష్ట్రానికి చెందిన షేక్ సుభానికు రవాణా చేస్తున్నారని ఇతను కూడా చింతూరు పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎన్‌డిపిఎస్ కేసులో నిందితుడిగా ఉన్నారని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వాహన తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.

రాజవొమ్మంగిలో వర్షం

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: మండలంలోని శనివారం సాయంత్రం ఆకస్మిక వర్షం కురిసింది. సాయంత్రం మూడు గంటల వరకూ తీవ్రమైన ఎండ కాయడంతో పాటు వడగాల్పులు వీచాయి. ఉక్కపోతతో అల్లాడుతున్న మన్యం వాసులకు శనివారం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులు, పిడుగులతో కూడిన కురిసిన వర్షంతో సేదతీరినట్లు అయింది. ఈదురు గాలులకు మామిడికాయలు నేలరాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



రహదారిపై కురుస్తున్న వర్షం

పంపిణీకి సిద్ధంగా విత్తనాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలో 1.5 టన్నుల గ్రీన్‌మెన్యూర్ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు స్థానిక వ్యవసాయ అధికారి చక్రధర్ శనివారం తెలిపారు. విత్తనాలు తమ దగ్గరలో ఉన్న రైతుసేవా కేంద్రాలకు వెళ్లి కొనుగోలు చేసుకోవాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు 10 కిలోలు ధర రూ.120 ఉందని తెలిపారు. జనుము విత్తనాలు పశుగ్రాసానికి ఉపయోగించుకోవచ్చన్నారు.

పింఛన్ ఇప్పించరూ..!

ప్రజాశక్తి -సీలేరు: వితంతు పింఛన్ మంజూరు చేయాలని కిలో పద్మిని అధికారులను కోరినట్టు తెలిపింది. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల కిందట తన భర్త కిలో చంద్ర మృతి చెందాడని, తనకి ఇద్దరు కుమార్తెలు ఉన్నారని అందులో పెద్దకుమార్తె అనారోగ్యంతో మృతి చెందగా, రెండో కుమార్తె పెళ్లయి అత్తవారింట్లో ఉందని తెలిపారు. అధికారులు స్పందించి పింఛన్ మంజూరు చేయాలని కోరుతోంది.



సరుకులు ఇస్తున్న సంస్థ సభ్యులు, సిపిఎం నేతలు

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలోని సీతగుంట గ్రామపంచాయతీ రోగుల గ్రామ నివాసి కమలమ్మకు ఒకే కాన్పులో ముగ్గురు ఆడబిడ్డల్ని జన్మనిచ్చిన విషయం తెలిసిందే. ఆదివాసి ఆర్మీ హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ ద్వారా తక్షణ ఆర్థిక సహాయం కింద రూ.5000, నిత్యావసర సరుకులను సభ్యులు శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు, సీతగుంట వైస్ సర్పంచ్ బొండా గంగాధరం, మాజీ ఎంపీపీ వెచ్చంగి కొండయ్య వినోద్ పాల్గొన్నారు.



బోధన చేస్తున్న మత గురువు

ఘనంగా బక్రీద్ వేడుకలు

ప్రజాశక్తి- చింతపల్లి : బక్రీద్ పర్వదినం సందర్భంగా శనివారం స్థానిక మజీద్ ఈ క్యూబా లో మత గురువు (ఇమామ్) షహీద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ పండుగ విశిష్టత ను వివరించారు. అనంతరం ఒకరికొకరు అలింగనం చేసుకుని మత సామరస్యాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా సాహెబ్, కమిటీ సభ్యులతో పాటు చింతపల్లి పరిసర గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు.

పలు రకాల సేవలకు అంతరాయం

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రభుత్వ సూచనల మేరకు గ్రామ/ వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న పలు సేవలు 10వ తేదీ మంగళవారం రాత్రి వరకు నిలుపుదల చేయడంతో సేవలకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు గమనించాలని ఎంపీడీవో డి సీతారామరాజు తెలియజేశారు.గ్రామ/వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న ఏపీ సేవ పోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డేటా సెంటర్ కి తరలింపు (మైగ్రేషన్) చేపడుతుందని, ఈ నిమిత్తం 7 వ తేదీ శనివారం ఉదయం నుండి 10 వ తేదీ మంగళవారం రాత్రి వరకు ఏపీ సేవ పోర్టల్ ద్వారా అందించు సేవలు నిలుపుదల చేయడమైందన్నారు. ఈ కారణంగా ఆదాయ ధ్రువీకరణ పత్రం, సమగ్ర ధ్రువీకరణ, భూమి మ్యూటేషన్లు, రేషన్/రైస్ కార్డులు, ఇల్లు స్థల పట్టాలు, వృద్ధాప్య ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ వాటర్ టాక్స్, పట్టణ పరిపాలన సంబంధిత సేవలు,మత్స్యశాఖ సేవలకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. మిగిలిన ఇతర ప్రభుత్వ సేవలు మీసేవా కేంద్రాలలో అందుబాటులో ఉంటాయన్నారు.



మామిడికాయల రక్షణకు సంచులు

ఓ రైతు వినూత్న ప్రయత్నం

ప్రజాశక్తి-చింతపల్లి: మామిడికాయలను కీటకాలు, పురుగులు, పక్షుల దాడుల నుంచి రక్షించేందుకు రైతులు సంచులను వాడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక రైతు కంకిపాటి పెంటన్న పడాల్ వెల్లడించారు. అతని తోటల్లో సంచులతో కాయలను కప్పడంతో ఈగలు, పురుగులు, ఇతర హానికర కీటకాలు కాయలపై పడకుండా అడ్డుకట్ట వేయవచ్చు. పక్షుల దాడి తగ్గుతుంది. వర్షపు నీరు కాయలను నేరుగా తాకకుండా ఉండటంతో పాడయ్యే ప్రమాదం తగ్గుతుంది. ఈ విధానంతో కాయలు సమానంగా పండుతూ, మెరుగైన రంగుతో మెరిసిపోతాయని, దీంతో మార్కెట్‌లో మంచి ధరలకూ విక్రయించవచ్చని ఆయన వివరించారు.

చెట్టుపై కాయలకు అమర్చిన సంచులు

డ్రోన్ల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి: వాణిజ్య పంటల సాగులో డ్రోన్ వినియోగాన్ని పెంచడం ద్వారా చీడపీడలను సకాలంలో తక్కువ ఖర్చుతో అదుపులో ఉంచవచ్చని వాణిజ్య పంటల పరిశోధన సంస్థ (రాజమండ్రి) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. ప్రభాకర్ రావు రైతులకు సూచించారు. వికసిత కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలో శనివారం దోసలపాడు, రేబాక, డి.ఎల్. పురం గ్రామాల్లో బిసిటి-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో, వ్యవసాయ శాఖ సహకారంతో శాస్త్రవేత్తలు, అధికారులు రైతులతో సమావేశం నిర్వహించి వాణిజ్య పంటల సాగు పై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు సరైన మోతాదులో వాడుతూ జీవ నియంత్రణ పద్ధతులను అవలంబించాలని సూచించారు. చిరుధాన్యాలను కనీసం ఇంటికి సరిపడా సాగు చేసుకుని, భోజనంలో ఒక పూట తప్పనిసరి చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ, మామిడి, బొప్పాయి, కూరగాయల పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు.బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం, సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, నవధాన్య పచ్చిరొట్ట ఎరువుల ప్రయోజనాలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'మధ్యాహ్న' నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ మెయిన్ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ప్రసన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం చేసి, వేతనాలు అమలు చేయాలన్నారు.

అనంతర నర్సీపట్నం మధ్యాహ్న భోజన నిర్వహణ సంఘం మండల కమిటీ ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షులుగా జల్లూరు నాగరాజు, కార్యదర్శిగా సత్యవేణి ఉపాధ్యక్షులుగా నూకరత్నం సహాయ కార్యదర్శిగా లావణ్య, కోశాధికారిగా కుమారి, మండల కమిటీ సభ్యులుగా లవ కుమారి, వరలక్ష్మి, లక్ష్మి, చింతల్లి, లక్ష్మి లను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం సంఘం కోసం నిరంతర పోరాటం చేస్తామన్నారు. ఎన్నుకున్న సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

పచ్చిరొట్ట ఎరువుతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి -కోటవురట్ల: పచ్చిరొట్ట ఎరువులతో బహుళార్ధ ప్రయోజనాలు చేకూరుస్తాయని బిసిటి కృషి విజ్ఞాన్ శాస్త్రవేత్త వి ప్రసాద్ రావు అన్నారు, వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం అన్నవరం ఎండపల్లి బికెపల్లి గ్రామాలలో పచ్చిరొట్ట ఎరువుల వినియోగం వాటి ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు, రానున్న ఖరీఫ్ సీజన్ లో ప్రతి ఒక్కరు జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట సాగు చేసి భూమిలో కలియదున్నాలన్నారు.దీంతో భూమి సారవంతం అవుతందన్నారు.పచ్చిరొట్ట ఎరువు నీటిని భూమిలో నిల్వ ఉంచేందుకు సహకరిస్తుందని, నేల సారవతం అవుతుందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ సభ్యులు రాంబాబు, వ్యవసాయ సహాయకులు హరికృష్ణ, గంగ త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పూడికతీత పనులు

ప్రజాశక్తి-పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం ముఠా కాలువలో పూడికతీత పనులను ముఠా కాలువ ఛైర్మన్ చింతలపు రామారావు చేపట్టారు. ఈ కాలువలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో రైతులకు సాగునీరు సరఫరాకు ఆటంకం కలుగుతోంది. కూటమి ప్రభుత్వం 32 లక్షలు గ్రాంటును ఈ కాలువ అభివృద్ధి కోసం విడుదల చేసింది. తుని నుంచి పాల్మన్ పేట వరకు వున్న ఈ కాలువలో 22 గేట్లును తిరిగి ఏర్పాటు చేస్తున్నామని ఛైర్మెన్ చింతలపు రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రెసిడెంట్ చింతలపు ప్రదీప్ (పద్దు), ఇరిగేషన్ శాఖ ఎఇ సురేష్ కుమార్, చింతలపు రాంబాబు, రాజుబాబు, ముఠా కాలువ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- పాయకరావుపేట: మండలంలోని గుంట పల్లిలో నాటుసారాతో పట్టుబడిన వ్యక్తిని అరెస్ట్ చేశామని పాయకరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఇ సోమయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ టి వెంకట అప్పలనాయుడు, అనకాపల్లి ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సంయుక్తంగా జరిపిన ఈ దాడుల్లో 10 లీటర్లు నాటుసారాతో ఒక వ్యక్తి పట్టుబడగా రిమాండ్ నిమిత్తం యలమంచిలి కోర్టుకు తరలించామన్నారు. సదరు వ్యక్తికి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందని తెలిపారు. ఈ దాడుల్లో ప్రొహిబిటీషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు పివి గిరి, ఎమ్ఎస్ రాజు, సిహెచ్ మధుసూదనరావు, సంతోష్ పాల్గొన్నారని తెలిపారు.

'గ్రానైట్ క్వారీపై పర్యవేక్షణ ఏదీ'?

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో కవగుంట సమీపంలో ఉరలోవ కొండపై గ్రానైట్ క్వారీని నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నా పర్యవేక్షణ పూర్తిగా కరువైందని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, క్వారీలో రాత్రి, పగలు అన్న తేడా లేకున్నా బ్లాస్టింగ్లు చేయడంతో ఇల్లులో సామగ్రి క్రింద పడటంతో ఒక్కసారిగా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు.గ్రానైట్ క్వారీ సమీపంలో భూముల్లో గ్రానైట్ బుగ్గి చేరడంతో చౌడు భూములుగా తయారయ్యి పంటల పండని పరిస్థితి నెలకొందన్నారు. కొండలపైన ఉన్న చెట్లను, కొండలను పిండి చేస్తూ కోట్లాది రూపాయలు క్వారీ యజమానులు సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. రావికమతం నుంచి ఘాట్ రోడ్డుకు వెళ్లే రోడ్డుకు ఈ క్వారీ సమీపంగా ఉండటంతో ప్రయాణికులు, పాదచారులు భయాందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి- గొలుగొండ: నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ శనివారం కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పల్లావూరు, పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. భీమవరం చెక్ పోస్టు, బంగారంపేట జంక్షన్, సీహెచ్.నాగాపురం వెళ్లే మార్గాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ, గంజాయి అక్రమ రవాణా నిరోధానికి ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టామన్నారు.

రేషన్ షాపులతో పరేషాన్

- పలుచోట్ల వికలాంగుల ఇళ్లకు సరుకులు అందించని డీలర్లు

ప్రజాశక్తి-గోపాలపట్నం : కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రేషన్‌లో ఇబ్బందులు తప్పడంలేదని కొందరు అభిప్రాయపడుతున్నారు. వినియోగదారులు, వికలాంగులకు ఇంటి వద్దకే సరుకులు సరఫరా చేస్తామనే ప్రభుత్వ మాటలు రేషన్ డిపో డీలర్లు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జివిఎంసి 89వ వార్డు అప్పలనరసింహనగర్ (చేపలకాలనీ) డిపోలో బెరా అప్పారావు కుటుంబంలో వికలాంగులు ఉన్నారు. రేషన్ సరుకులు డిపో నుంచి తెచ్చుకోలేమని ఇంటికి ఇవ్వాల్సిందిగా కోరారు. మీకు నచ్చితే డిపోకు వచ్చి పట్టుకెళ్లండి, లేదంటే మానేయమని డీలర్ సమాధానమిస్తున్నారని అప్పారావు చెబుతున్నారు. జివిఎంసి 92వ వార్డు పరిధి శ్రీరాంనగర్ డిపోలో పతివాడ అప్పన్న 15 కేజీల బియ్యం తీసుకుంటే 13 కేజీలే వచ్చాయని ఆయన చెబుతున్నాడు. రేషన్ డీలర్లతో సమస్యలు వస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు అభినందనలు

ప్రజాశక్తి -ములగాడ : పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5వ తేదీన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ నిర్వహించిన సదస్సులో పాల్గొని ప్రతిభ చూపిన సెయింట్ ఆన్స్ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులకు, వాలంటీర్లకు శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి మాట్లాడుతూ, 'హరిత పరిసరాలు అవగాహనతోనే సాధ్యం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, ఇతర ప్రోగ్రాం అధికారులు వై.అనసూయాదేవి, వి.అంజలీదేవి, ఎ.సంధ్యారాణి, ఎన్.నదియా అభిప్రాయాలు తెలిపారని, అవి ప్రశంసలను అందుకున్నాయని చెప్పారు. సదస్సులో కళాశాల నుంచి 20 మంది వాలంటీర్లు క్విజ్, పెయింటింగ్‌లో బహుమతులు పొందారని తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన హెచ్‌ఎం ఆదిలక్ష్మి

శతశాతం ఉత్తీర్ణతకు కృషి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం పదోతరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నట్టు పాఠశాలలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన హెచ్‌ఎం ఆదిలక్ష్మి శనివారం తెలిపారు. శనివారం హెచ్‌ఎం ఆదిలక్ష్మిని పాఠశాల సిబ్బంది అలాగే పిఎంసి కమిటి చైర్మన్ ఎం.శీను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆదిలక్ష్మి మాట్లాడుతూ గత ఏడాది జెడ్పి ప్లస్ వన్ పాఠశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో అందరూ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. బెటర్మెంట్ పరీక్షలు రాసిన లోతా యామిని 470కి 421 మార్కులు సాధించి పాఠలకు టాపర్‌గా నిలవడం జరిగిందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి పిఎంసి కమిటి,పాఠశాల సిబ్బందితో కలిసి కృషి చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం తమకు అవసరమని తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీలో శతశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో శతశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ శంకరరావు వెల్లడించారు. ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడుతూ ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఫెయిలైన విద్యార్థులు 17 మంది పరీక్షలు రాయగా పూర్తి స్థాయిలో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, కళాశాలలో చేరడానికి ఆధార్‌కార్డు పాస్‌పోర్టు, కులధ్రువీకరణపత్రం సమర్పించవలసి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలను సంప్రదించాలని కోరారు.

వినియోగదారుల విశ్వాసంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారులు చూపిన విశ్వాసం, మద్దతు తమ బ్యాంకు అభివృద్ధికి కీలకమని బ్యాంక్ జిఎం మనోజ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. స్థానిక షెల్టాన్ ఫోర్ పాయింట్స్ హెరీటల్లో విశాఖపట్నం క్లస్టర్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ ఔట్‌రీచ్ కార్యక్రమం సత్కార వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జీఎం మనోజ్ శ్రీవాస్తవ, జోనల్ మేనేజర్ నికేష్‌కుమార్ సిన్హా, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎన్. సీతారామ్ బ్యాంకు వినియోగదారులను సత్కరించారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై 9న విశాఖలో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపాలని, ఇప్పటికే తొలగించిన కాంట్రాక్టు కార్మికులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఈ నెల 9న విశాఖలో జరిగే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు శనివారం ఓ సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం నుండి ఉదయం 10 గంటలకు జరిగే స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సంఘీభావ ర్యాలీలో యావత్తు కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అక్రమంగా కార్మికులను తొలగిస్తోందని చెప్పుకొచ్చారు. ఇప్పటికే 1200 మంది పర్మినెంట్ కార్మికులను విఆర్‌ఎస్ పేరుతో తొలగించారన్నారు. మొదటి విడతలో కాంట్రాక్ట్ కార్మికులు 1600 మందిని, ఇప్పుడు మరొక 1500 మందిని తొలగించారన్నారు. మొత్తంగా కాంట్రాక్టు కార్మికులను 5,600 మందిని తొలగిస్తేనే ప్యాకేజీలో మిగిలిన డబ్బులు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం షరతు పెట్టిందని చెప్పారు. ఈ షరతులన్నీ కూటమి నాయకులకు తెలుసునన్నారు. ఎన్నికలకు ముందు ప్లాంట్ పరిరక్షణకు ప్రాణాలైనా అర్పిస్తానని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ నిరాహార దీక్ష చేశారన్నారు. ఇప్పుడేమో ప్లాంట్ నష్టాలకు కారణం కార్మికులేనని చెబుతున్నారని, ఇది ఎంత వరకూ భావ్యమని పేర్కొన్నారు.

ప్రైవేట్ హాస్పిటల్స్‌కు ధీటుగా కెజిహెచ్

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా కెజిహెచ్‌లో ఆధునిక సదుపాయాలను కల్పిస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. శనివారం కెజిహెచ్ మార్చురీ వద్ద పోలీస్ అవుట్‌పోస్ట్, టెస్లా సెంటర్ వద్ద రోగుల నిరీక్షణ ప్రాంతం షెడ్లు, ఫార్మసీ వద్ద రోగుల నిరీక్షణ ప్రాంతం షెడ్లను ఆయనతో పాటు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కెజిహెచ్‌లో మెరుగైన సదుపాయాలు కల్పనకు నిరంతర కషి చేస్తున్నానని,ప్రణాళిక ప్రకారం మరిన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి కెజిహెచ్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో స్థానిక వైద్యసిబ్బంది కషి చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం సంధ్యాదేవి, స్థానిక కార్పొరేటర్ అప్పల రత్నం, వార్డు జనసేన అధ్యక్షురాలు యజ్ఞశ్రీ, పలు విభాగాల అధిపతులు, సిఐ జి.డి బాబు పాల్గొన్నారు.



రోగుల నిరీక్షణ ప్రాంతం షెడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు స్టే తొలగింపు

రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు
ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు రూ.500 కోట్లతో ప్రారంభం కానున్నాయని ఎంపి ఎం.శ్రీభరత్ తెలిపారు.ఈ పనులపై ఉన్న కోర్టు స్టే తొలగిపోయిందన్నారు. అభివృద్ధి పనులు 18 నుంచి 21 నెలల వ్యవధిలో పూర్తవుతాయన్నారు. ఇప్పుడు ఉన్న 8 ఫ్లాట్ ఫామ్‌లతో పాటు మరో 6 ఫ్లాట్‌ఫామ్‌లు రానున్నాయన్నారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. దక్షిణకోస్తా రైల్వేజోన్‌కు జనరల్ మేనేజర్‌ను రైల్వేబోర్డు నియమించిందని, సందీప్ మాథుర్‌ను జిఎంగా నియమించడం సంతోషకరం అన్నారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. విశాఖ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని, రికార్డ్ సాధించే విధంగా వేడుకలు ఉంటాయన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ దక్షిణకోస్తా రైల్వేను గత ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదన్నారు. సమావేశంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్‌గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు గండిబాబ్జి, జిల్లా ఉపాధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్ పాల్గొన్నారు.



టిడిపి జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపి శ్రీభరత్

విసిబి నికర లాభం రూ.71.77 కోట్లు

2025-26 ఆర్థిక లావాదేవీల లక్ష్యం రూ.8600 కోట్లు
ఈ ఏడాది మరో 5 కొత్త బ్రాంచ్‌లు
విసిబి ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ (విసిబి) ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.71.77 కోట్లు నికర లాభం కలిగి ఉందని విసిబి ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. శనివారం ద్వారకానగర్‌లోని బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 55 బ్రాంచిలు గల తమ బ్యాంకు పరిధిలో 1,11,593 మంది సభ్యులున్నట్లు వివరించారు. విసిబిలో షేరు ధనం రూ.389.55 కోట్లు కాగా, డిపాజిట్లుగా రూ.4354.73 కోట్లు ఉన్నాయన్నారు. కాగా రూ.3436.47 కోట్లు రుణాలు అందించినట్టు తెలిపారు. ఇందులో 95 శాతం కోటి రూపాయల కంటే తక్కువ మొత్తం అందజేశామని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి దాదాపు రూ.7800 కోట్లకు ఆర్థిక లావాదేవీలు చేరుకున్నాయన్నారు. ఆరోగ్య బీమా పథకం ద్వారా సభ్యులకు వైద్య బీమా అందిస్తున్నామన్నారు. మరణించిన సభ్యుల కుటుంబాలకు వారి షేరుధనానికి సమానంగా కనిష్టంగా రూ.5 వేలు, గరిష్టంగా రూ.లక్ష వరకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ప్రమాదంలో మరణించిన సభ్యుల కుటుంబాలకు రూ.50వేలు అదనంగా చెల్లిస్తున్నామన్నారు. సభ్యుల పిల్లలకు విద్యాపురస్కారాలు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరాంతానికి రూ.8600 కోట్లకు ఆర్థిక లావాదేవీల లక్ష్యం కాగా ఈ ఏడాది మరో 5 బ్రాంచి లను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది చివరకు నూజివీడు, తెనాలి, అమలాపురం, హైదరాబాద్, విశాఖపట్నంలలో కొత్తగా ఐదు బ్రాంచిలను ప్రారంభించుకుని బ్రాంచిల సంఖ్య 60కి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. భవిష్యత్‌లో నంద్యాల,అన్నమయ్య, సత్యసాయి,ఖమ్మం, నల్గొండ,వరంగల్ ప్రాంతాల్లో తమ బ్యాంకు సేవలను విస్తరించాలని భావిస్తున్నామన్నారు. గాజువాకలో బ్రాంచికు సొంత భవనాన్ని నిర్మించేందుకు వీలుగా నిర్మాణం ప్రారంభమైందన్నారు. గోపాలపట్నంలో త్వరలో నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు. ఆదివారం మద్దిలపాలెం కాకతీయ కన్వెన్షన్ హాలులో జరగనున్న 110 వ మహాజన సభలో డివిడెండ్‌ను ప్రకటించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఈఓ వివిబి వరలక్ష్మి, డైరెక్టర్లు సూర్యనేని నాగభూషణ చౌదరి, ఎజె స్టాలిన్, నామాన కామరాజు, వి.చంద్రశేఖర్, జె.వి.సత్యనారాయణమూర్తి, గుళ్లపల్లి జనార్ధనరావు, సిహెచ్. ఆదినారాయణశాస్త్రి, పి.వెంకటరమణారావు, కె. ప్రసాదరావు, ఉప్పలపాటి పార్వతిదేవి, సి. కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.




ఎమ్మెల్యే గంటాను సన్మానిస్తున్న కాంట్రాక్టర్ల అసోసియేషన్ కార్యవర్గం

గ్రేటర్ అభివృద్ధిలో కాంట్రాక్టర్లు కీలకం

- ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -ఎంవీపీ కాలనీ: మహావిశాఖ నగరపాలక సంస్థ అభివృద్ధిలో కాంట్రాక్టర్ల దే కీలక పాత్ర అని మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన సివివి నాగరాజు, కార్యదర్శి సంజీవరెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు శనివారం గంటాను ఆయన నివాసం లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తొలుత గంటాను కాంట్రాక్టర్ల అసోసియేషన్ కార్యవర్గం ఘనంగా సత్కరించగా అనంతరం ఆయన నూతన అధ్యక్ష కార్యదర్శులను సత్కరించి వారికి అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వ పరంగా తమ వంతు సహకారం అందిస్తామని నగరాభివృద్ధికి కాంట్రాక్టర్లు తోడ్పాటునందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, నావెల్ డాక్‌యార్డ్ కేటిబి అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగిన సంఘం సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 42 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందన్నారు. సమ్మె కాలంలో కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల జీతాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు. ఏడాది గడుస్తున్నా సమస్యలను పరిష్కరించలేదన్నారు. అందుకే జులై 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మినీసెంటర్లను మెయిన్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తామన్న జిఒను నేటికీ ఇవ్వలేదన్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు సొంత భవనాలు కేటాయించాలని కోరారు. అనంతరం సంఘం అర్బన్ ప్రాజెక్టుకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఆర్.ఈశ్వరమ్మ, అధ్యక్షులుగా శోభారాణి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.తులసి, కోశాధికారిగా ఇందిర, ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా ఎర్రయమ్మ, పార్వతి, కమిటి సభ్యులుగా శివలక్ష్మి, రాధ, నజ్మా, వల్లి రాణి, పైడికొండ, కుమారి, మహాలక్ష్మి ఎన్నికయ్యారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి, నాయకులు బృందా, వెంకటలక్ష్మి, పద్మ, పి.మణి పాల్గొన్నారు

రాష్ట్రపతి విశాఖ పర్యటన వాయిదా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 10న విశాఖలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పర్యటన వాయిదా పడింది. వాస్తవానికి ఆమె కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. పలు కారణాల వల్ల మొదటి స్నాతకోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్టు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నుంచి శనివారం ఓ ప్రకటన విడుదలైంది. తదుపరి తేదీని త్వరలోనే తెలియజేస్తామని వర్సిటీ అధికారులు పేర్కొన్నారు.